# తోడేలు జగత్తు

సి. వి. కృష్ణారావు

ప్రొద్దున లేచినప్పుడు కాఫీహోటల్ దగ్గరనుంచి రాత్రి రెండో ఆట సినిమా టిక్కెట్టు దొరికే వరకూ నేడు పట్టణాల్లో జనానికి వత్తిడి ఎక్కువైంది. ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, యినుప కోటాల్లో, యిటుక బట్టీల్లో, రష్ ఎక్కువైంది— ఒక సిగరెట్ పదిమంది స్మోకర్స్.

మొన్న వురయ్యూరు బస్‌స్టాండుకు నేను వచ్చేప్పటికి మధ్యాహ్నం మూడు గంటలైంది. ఒక్కొక్క బస్ రావటం, వందమంది జనం ప్రధానమంత్రి వస్తే తోసుకున్నట్లు ముందు కురకటం—టిక్కెట్లు దొరక్కపోవటం—పర్సులు ఖాళీ చేసుకోవటం!

అందులో నేనొకణ్ణి-నలుగురుతో పాటు నారాయణుణ్ణి. ప్లాజాలో సినిమాకు వెళ్ళినప్పుడు ఇంగ్లీషు అమెరికన్ సోల్జర్లు 'క్యూ' లో నిలబడ్డ తీరుకు లోపల మెచ్చా, మన ఆంధ్రజనావళిని గొర్రెగుంపుగా పోల్చుకుంటూ తిట్టా.

బందరు దిక్కునుంచి బస్ వస్తూంటే 'అదిగో!' అని వంద మనోవృక్షాలు చిగురించాయి. బస్ ఆగీ ఆగకముందే కండక్టరుసీటు వైపు చేతి సంచుల వాళ్ళూ, ఖద్దరు లాల్చీలవాళ్ళూ కళ్ళజోడు చేత్తో పట్టుకున్నవాళ్ళూ, చెప్పుకాళ్ళతో పాదాలు నలగదొక్కేవాళ్ళూ!

నలుగురు దిగారు—టిక్కెట్లు లేవన్నాడు, కండక్టర్. ప్రాధేయపడ్డారు అందరూ. 'నేను చాలా అత్యవసరంగా పోవాలె మా నాయన గదూ'— అని వేళ్లాడబడ్డారు యింకొందరు. ముఖాలు వేలవేశారు మొత్తానికి అందరూ.

“నలుగురు దిగితే ఒకటీ లేదంటాడేమిటండీ,” అన్నాడు ఒకాయన.

“అదే నేను దేశంలో జరిగే వ్యాపారం” అన్నాను దక్షిణంవైపు జూస్తూ.

“ఒరే నువ్వట్రా” అన్నాడు అడిగినాయన.

ఎవరా? అని అవ్యక్తిని చూశా; మా క్లాస్ మేట్ కోటి. అవీ యివీ మాట్లాడుకొని టిక్కెట్లు దొరికేందుకు ఎన్నో వుపాయాలు ఆలోచించాం యిద్దరం. పత్రికలు-అమ్మే కుర్రాడు వస్తే 'మాకు పేపర్లొద్దుగ్గాని, ఒక పావలా తీసికొని బెజవాడకు టిక్కెట్టిప్పించు—నీకు మంచి ఆదాయం,” అన్నాడు మావాడు.

ఇక ప్లాన్ చెప్పటం మొదలెట్టాడు-“నీవు యింజన్ ముఖంగారా, నేను 'డోర్' వేపునుంచి వస్తా: ఎవరికి దొరికినా రెండు తీసికొందాం.”

ఒకటీ దొరకదని లోపల నమ్మకంతో “ఇద్దరికీ దొరుకుతే” అన్నాను విపరీతంగా.

“ఇంకోరి కిద్దాం” అన్నాడు దయాసంధతతో.

ఇంతవరకూ నామనసులో చంటిపిల్లల మాదు పైన ఎండకు పైట చెంగుకప్పుకొని వున్న నిత్తే ఫులూ, గొడుగూ, సంచీ వుత్తరీయం కాచుకుంటూ టిక్కెట్టు తీసికోవాలని తహతహపడి టిక్కెట్టు దొరక్కపోగా ఏదోఒకటి పోగొట్టుకున్న వళిష్ఠులూ, మాటిమాటికీ జేబులో కలంమీదికి పోయే నాచేతి చాలన శాస్త్రమూ, మాత్రమే వున్నాయి. ఇక యిప్పుడు రెండు టిక్కెట్లు ఒక్కడికీ యిస్తారా అనీ, ఒకటే అడుగుతే నన్ను మావాడు మోసకారి అనుకుంటాడేమోననీ, నేనొక్కణ్ణే కాకెక్కితే మళ్లా వాడికినాముఖం ఎల్లా చూపించాలనీ ఆందోళన. ఎలాగైనా కానీ రెండూ అడగాల్సిందే—యివ్వకపోతే ఎలానని ముఖం వేలవేస్తే అప్పటికన్నా నన్ను అనుమాన రహితుణ్ణిగా అనుకోడా? అని తృప్తిపడ్డా.

కారు వచ్చింది. కండక్టర్ దిగాడు. చుట్టూ గుమిగూడారు-మేమనుకున్న ప్లాన్ మెదడు మూలమలుపుకు నెట్టి, ఆ కిళ్లీకొట్టు ఆయనద్వారా ఏమన్నా పని జరుగుతుందేమో చూసివస్తానన్నాను. 'సరే'నన్నాడు కోటి.

నేను ముఖం విఫలుణ్ణయి వేళ్లాడేసుకొని వచ్చేప్పటికి వీడు వెనక సీటుమీద ఎక్కి కూచోబోతున్నాడు. 'విముక్తి లభించిం' దనుకొన్నా— రెండూ తీసికున్నాడుగదా అనుకొని.

“కోటీ, టిక్కెట్టు దొరికిందిరా!” అన్నా.

“ఏం దొరికిందో, డబ్బుమాత్రం కండక్టరు ముఖాన బారేశా” అన్నాడు చెక్కపేడు ముఖంతో చంటిపిల్లవాడి తెలియమి చూపించాలని ప్రయత్నిస్తూ.

రెండింటికీ అలాగే పారేయ లేకపోయినావా? అని నేను అడగలేకపోయినాను—వాడు చప్పుడు కాకుండా కూర్చున్నాడేగాని నాకు దొరకనందుకు విచారంగాని, రెండింటికీ ప్రయత్నం చేస్తే దాని ఫలితం గాని, పెదిమకదిల్చి చెప్పలేదు!

“రైట్” అన్నాడు కండక్టర్.